సగా నడుస్తున్నారు కొందరు రోడ్డుమీద సైనికులు మార్చింగ్ చేస్తున్న ట్లుగా. వాళ్ళ ముఖాలు మాడిపోయి వున్నాయి. వాళ్ళ దగ్గిరకు వెళ్ళాను.

ఇంజనీరు ప్రసాదరావు తలమీద——

డా॥ కిరణ్ తలమీద——

సెక్షన్ ఆఫీసర్ ముకుందం, అతని సహచరుల తలలమీద కుర్చీలు——

కుర్చీలు——

తలలు భూమివేపు, తలమీద కుర్చీలు పెట్టుకుని నడుస్తున్నారు వాళ్ళు అందరితోపాటుగా——

అందరికంటె ముందుగా పైలట్‌లా సబ్ ఇనస్పెక్టర్, చివరలో గార్డ్సులా పోలీసులు.

వాళ్ళు అలా వెళుతుంటే జనం అనుకుంటున్నారు.

ఏమని?

"వీళ్ళందరూ రాత్రి వీడియోలో బ్లూ ఫిలిం చూస్తుంటే పట్టుకుని, తెల్లార్లూ స్టేషన్‌లో వుంచి, ఇంకెప్పుడూ చూడకుండా ఇలా వీధుల్లో తిప్పు తున్నారట'' అని——

(బ్లూ ఫిలిమ్స్ చూసే వారందరికి క్షమార్పణలతో——రచయిత)

—o—

# చంటబ్బాయ్

జ్యోతికి పెళ్ళయింది. జ్యోతి చాలా ఫాస్ట్ గాళ్. అయితే ఆమె ఆశలకు అనుగుణంగా ఆమె భర్త దొరక్కపోవడం ఆమెకు కించిత్ నిరాశ కలిగించింది.

తన భర్త మొదటిరాత్రి కూడా ముద్దపప్పులా ప్రవర్తించడంతో తన జీవితంలో వున్న ఫాస్ట్‌నెస్ అంతా కొన్నివేల క్రేన్స్‌తో వెనక్కు లాగేసినట్టయింది జ్యోతికి

"జ్యోతీ నా పెన్నెక్కడుందో చూడు''

"జ్యోతీ నా బట్టలు ఫుతికించు''

"జ్యోతీ నాకు ఇవ్వాళ గుత్తివంకాయకూర కావాలి"

ఛీ....డర్టీ....

ఒక్కసారి....

"తెల్ల చీర కట్టుకో

మల్లెపూలు పెట్టుకో"

"ఇవ్వాళ రంభలా వున్నావ్"

అంతే ఒట్టు. ఆ జడపదార్ధంలాంటి వ్యక్తికి అసలు ప్రేమనేది వుందా? అని అనుమానం వచ్చింది జ్యోతికి.

ఇది ఇలా వుండగా....

తనతోపాటే పెళ్ళయిన తన స్నేహితురాలు రమనుండి ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరంలో....

"డియర్ జ్యోతీ....

జీవితం ఒక ఆటలాంటిది. ఆటలో ఎవరు గెలుస్తారో చెప్పలేము కానీ నేను వోడిపోయాను.

నా భర్తకు స్త్రీలంటే చాలా చులకన. దాసిలతో సమానంగా చూస్తారు హింసిస్తారు. మా కుటుంబంలో ఆయన మాటకు తిరుగులేదు. స్త్రీ అంటే కాలిక్రింద చెప్పుతో సమానం ఆయనకి. నువ్వు సుఖంగా వుండాలని వుంటావని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నాను....అభాగ్యురాలు....రమ....

మంచంమీద కూర్చుని ఉత్తరం చదువుతున్న జ్యోతిని ఆశ్చర్య పరుస్తూ వడివడిగా వచ్చాడు ఆమె భర్త.

"జ్యోతీ చూడవోయ్ కళ్ళల్లో నలక పడింది".

అంటూ గబగబా ఆమె ఒడిలో తల పెట్టుకుని పడుకున్నాడు.

జ్యోతి వెంటనే అతని కనురెప్పలు విడదీసి నలకను చూస్తూ చంటిపిల్లాడి లాంటి తన భర్తతో, రమ భర్తను ఊహించుకుంటూ పోల్చు కుంటూ అతని కళ్ళల్లో ఊది,

"నలక పోయింది" అంటూ ఒక కిస్ ఇచ్చింది.

ఇన్ని రోజులూ ఆమె నిర్లిప్తతకు కారణం తెలుసుకోలేని ఆమె భర్త ఈ హఠాత్పరిణామానికి ఆశ్చర్యపోయాడు. ....★....